క్లుప్తంగా

20న మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి స్వామి వారి కల్యాణోత్సవాలు

టేకుపల్లి(మోపిదేవి): టేకుపల్లిలోని బాల పార్వతి సమేత రామేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ధ్వజారోహణానికి ఆలయంలోని నందీశ్వరుని రంగులతో అందంగా సిద్ధంచేశారు.

ముగిసిన హనుమాన్ జయంత్యుత్సవాలు



పెడన: స్థానిక తోటమూల సెంటర్‌లోని అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమాన్ జయంత్యుత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 12వ తేదీ నుంచి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి తమలపాకుల సేవ, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు సుబ్బారాయుడికి లక్ష మల్లెలతో పూజ

మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం ఉదయం లక్ష మల్లెలతో పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ నిర్వహించే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం గురువారం ఉదయం 11 గంటల వరకు జరుగుతుందని చెప్పారు.

మహాయజ్ఞానికి తరలిన శ్రీకాకుళం భక్తులు

ఘంటసాల(శ్రీకాకుళం): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న లక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమానికి శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం నుంచి భక్తులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక బస్‌లో మంగళవారం తరలివెళ్ళారు. తొలుత శ్రీకాకుళేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రశాంతంగా ఏపీ ఈ ఏపీ సెట్ పరీక్ష

పెడన: మండలంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రెండో రోజు ఏపీ ఈ ఏపీ సెట్ -2023 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 130 మందికి 127, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 130 మందికి 126 మంది హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, పరీక్షా కేంద్రం అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు.

భార్యపై భర్త దాడి

పెడన: తన భర్త తాగి వచ్చి వేధించడమే కాకుండా దాడిచేసి గాయపరిచాడని భార్య పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జన్ను కృష్ణవాణి పట్టణంలోని ఏడో వార్డులో నివాసం ఉంటోంది. తన భర్త వీర వెంకట నందిరాజు సెంట్రింగ్ పనులకు వెళ్తుంటాడు. మద్యం సేవించి తనను హింసించడమే కాకుండా కర్రతో కొట్టి కత్తితో గాయపరిచాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ రవిచంద్ర కుమార్ కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధుడు మృతి



చలమయ్య (ఫైల్)

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు చెందిన శతాధిక వృద్ధుడు కూనపరెడ్డి చలమయ్య (103) సోమవారం రాత్రి 11 గంటలకు మృతిచెందాడు. ఈ వయస్సులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. ఆయనకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. స్థానిక కేటీఆర్ మహిళా కళాశాలలో జరిగిన ఈ జాబ్ మేళాలో రాష్ట్రానికి చెందిన వివిధ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించగా మొత్తం 41 మందికి ఉద్యోగాలు లభించాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహకులు పి.మధు, ఇడి సుజిత్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ శేషుబాబు, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు ప్రభుత్వం అండ

- వేట నిషేధ సమయంలో నగదు జమ
- కోడూరు మండలంలో 957 కుటుంబాలకు మత్స్యకార భరోసా

కోడూరు: చేపల వేట నిషేధిత సమయంలో కూడా గంగపుత్రుల కుటుంబాలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. సముద్రంలో చేపలు పునరోత్పత్తి చెందే సమయమైన ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు కేంద్రం 61 రోజుల పాటు వేట నిషేధిత సమయంగా ప్రకటించింది. చేపల వేటే జీవనాధారమైన గంగపుత్రులు ఈ సమయంలో ఇళ్లకే పరిమితమం అవుతారు. మత్స్యకారులకు అండగా నిలుస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేట నిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా గంగపుత్రుల



ఉల్లిపాలెం ఆర్‌బీకేలో టీవీ ద్వారా సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వింటున్న మత్స్యకారులు

కుటుంబాలకు ఆర్థికంగా చేయూతినిస్తున్నారు. ఇచ్చిన మాటను నేరవేరుస్తూ వరుసగా ఈ ఏడాది కూడా మత్స్యకారుల ఖాతాల్లో నగదును జమ చేశారు.

సముద్రతీర ప్రాంతమైన కోడూరు మండలంలో 957 కుటుంబాలకు మత్స్యకార భరోసా లభించిందని ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పాలకాయతిప్ప, హంసలదీవి, బసవానిపాలెం, విశ్వనాథపల్లి, ఉల్లిపాలెం, సాలెంపాలెం గ్రామాలకు చెందిన 162 బోట్లలో వేటకు వెళ్లే మత్స్యకారులకు భరోసా వర్తించిందని తెలిపారు. ఒక్కొక్క బోటుకు సంబంధించి ఎనిమిది మంది మత్స్యకారులకు భరోసా నగదును ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందని ఎఫ్‌డీఓ వివరించారు.

బాపట్లలోని నిజాంపట్నంలో జరిగిన మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక మత్స్యకారులు ఉల్లిపాలెం ఆర్‌బీకేలోని టీవీ ద్వారా వీక్షించారు. వేట నిషేధ సమయంలో తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గంగపుత్రులు కృతజ్ఞతలు తెలిపారు.

తక్షణం ఇళ్లు నిర్మించుకోవాలి

పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు

పెడన: జగనన్న కాలనీ లబ్ధిదారులు తక్షణం ఇళ్లు నిర్మించుకోవాలని పెడన ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు అన్నారు. మండలంలోని చేవేంద్ర, కమలాపురం, కొప్పెల్లి గ్రామ సచివాలయాల్లో హౌసింగ్ లబ్ధిదారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి స్థలాలు ఇచ్చి చాలా రోజులు అయిన నేపథ్యంలో పునాదులు కూడా వేయని వారు తక్షణం ఇళ్లను నిర్మించుకోవాలని ఎంపీడీఓ స్పష్టం చేశారు. కొప్పెల్లిలో 15 మందికి ఎనిమిది మంది పునాదులు కూడా వేయలేదని, చేవేంద్రలో 20 మందికి పది మంది కూడా వేయలేదని చెప్పారు. ఆయా లబ్ధిదారులను చైతన్యం చేయగా కాంట్రాక్టరు ఎవరైనా ముందుకు వచ్చి మా ఇళ్లను నిర్మిస్తామంటే వారికి అప్పగి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

స్తామని లబ్ధిదారులు ముక్తకంఠంతో అధికారులకు బదులిచ్చారు. ఆ దిశగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కమలాపురంలో లెవలింగ్ మళ్లీ చేయాలని లబ్ధిదారులు పేర్కొనడంతో పునాదులు వేసుకోవాలని, ఆ తరువాత లెవలింగ్ చేయిస్తామని చెప్పారు. ఆయా సచివాలయాల్లో జరిగిన సమావేశాలలో వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, సర్పంచ్ గుడిసేవ శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంకెం గిరిబాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టులకు సంబంధించి అంగన్‌వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీకి మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆర్డీఓ ఐ. కిషోర్, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. సుష్మ పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. అవనిగడ్డ, బంటుమిల్లి, మచిలీపట్నం, పెడన, మొవ్వ ప్రాజెక్టులకు సంబంధించి నాలుగు అంగన్‌వాడీ టీచర్ల పోస్టులకు 18 మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు 17 మంది హాజరయ్యారు. మినీ అంగన్‌వాడీ టీచర్ రెండు పోస్టులకు ఇద్దరు దరఖాస్తు చేసుకోగా ఇరువురు హాజరయ్యారు. 19 హెల్పర్ పోస్టులకు సంబంధించి 37 మంది దరఖాస్తు చేసుకోగా 35 మంది హాజ



అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీఓ కిషోర్, ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు

రయ్యారు. ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం ఆయా అభ్యర్థుల విద్యార్హతలు, ఇంటర్వ్యూల్లో పాల్గొన్న విధానాలను బట్టి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని, అనంతరం పోస్టులకు ఎంపిక చేస్తారని ఐసీడీఎస్ పీడీ సువర్ణ తెలిపారు.

హజ్రత్ నిర్గన్ షా ఉరుసు ప్రారంభం

గూడూరు: గూడూరులో ప్రసిద్ధి చెందిన హజ్రత్ నిర్గన్ షా అవులియా దర్గాలో ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గంధ మహోత్సవం నిర్వహించారు. మత గురువులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబాను దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు. ఈ సందర్భంగా బాబా ప్రతీకగా ఆకుపచ్చని జెండా, గుర్రాన్ని డప్పు వాయిద్యాలతో వీధుల్లో ఊరేగించారు. తెల్లవారుఝాము వరకు సాగిన ఊరేగింపులో యువకులు చేసిన కర్రసాము ఆకట్టుకుంది. ఉత్సవాలను పురస్కరించుకుని దర్గా పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల కోసం సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుగణంతో సందడి నెలకొంది. గ్రామంలో పండుగ



వాతావరణం సంతరించుకుంది. భక్తుల సౌకర్యార్థం కమిటీ అధ్యక్షుడు మహ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వక్ఫ్‌బోర్డు అధికారులు ఉత్సవాలను పర్యవేక్షించారు.

● పేర్ని నాని దంపతుల పూజలు



దేవదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత లక్ష్మీ మహాయజ్ఞంలో మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని దంపతులు మంగళవారం పాల్గొన్నారు. వీరు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

‘ఉపాధి’ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా హౌసింగ్ పీడీ సూర్యనారాయణ

గుడివాడరూరల్: ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని మోటూరు గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పంట బోదె తవ్వకం పనులను సందర్శించారు. కూలీలకు ఏర్పాటు చేసిన టెంట్, ఆరోగ్య కిట్, ఓఆర్ఎస్ ఎనర్జీప్యాకెట్లు తదితర వసతులపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ రోడ్‌లో ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్ గృహ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన ప్రతి వ్యక్తి ఉపాధిహామీ పథకంతో లబ్ధిపొందాలన్నారు. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి



ఉపాధిహామీ కూలీలకు సూచనలు చేస్తున్న సూర్యనారాయణ

చేయాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే మెటీరియల్‌ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఉప సర్పంచ్ వీరనరసింహారావు, ఉపాధిహామీ ఈసీ రామకృష్ణ, టీఏ రమేష్, హౌసింగ్ ఏఈ పృథ్వీ, పంచాయతీ కార్యదర్శి జనార్థనరావు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు భేష్

ప్రపంచ బ్యాంక్ బృంద సభ్యుడు డాక్టర్ సందేష్

గుడివాడ టౌన్: గుడివాడ బాపూజీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ టీమ్ సభ్యుడు డాక్టర్ సందేష్ అన్నారు. ఆయుష్ భారత్ ప్రోగ్రామ్ పనితీరును పరిశీలించేందుకు ఆయన మంగళవారం బాపూజీ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు చేశారు. రోగుల వివరాల రికార్డులు, సేవలు అందుతున్న వివరాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుష్ భారత్ ఐడీ నంబర్లు పంపిణీ చెయ్యడంలో బాపూజీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని అన్నారు.

90 శాతం మంది అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని రోగులకు ఈ కార్డులు అందజేసి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ సి.సుదర్శన్‌బాబు, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు డాక్టర్ గంట టిన్సన్, సీసీ శాస్త్రి, సీఓ రామారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

పెడన: వరకట్నం కేసు నమోదైనా ఇంకా తనను అత్తింటి వారు వేధిస్తున్నారని, భర్త కత్తితో దాడి చేసి గాయపరిచాడని వివాహిత పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నపుల్లపాడు గ్రామానికి చెందిన బోట్ల జ్యోతిక భర్తతో కలిసి ఉంటోంది. ఈ నెల 11వ తేదీన తన కుమారుడు ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో అత్త పిల్లాడిని ఎత్తుకు వెళ్లింది. దీనిపై ప్రశ్నించిన తనను భర్త గోపీ, మామ శేషయ్య, అత్త సముద్రవేణిలు దూషించారని పేర్కొంది. భర్త గోపీ కత్తితో తనను బెదిరించడమే కాకుండా గాయపరిచాడని తెలిపింది. మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె అక్కడి అవుట్ పోలీసుల ద్వారా పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

పెడన: పట్టణంలోని 15వ వార్డుకు చెందిన తమ్ము సుబ్బారావు (52) పని మీద నడుపూరు వెళ్లాడు. తిరిగి పెడన వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం లైట్ కాంతితో రోడ్డు కనిపించక వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. సోమవారం రాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సుబ్బారావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. మచిలీపట్నం అవుట్ పోలీసుల సమాచారం మేరకు పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెగోడీల వ్యాపారి అసభ్య ప్రవర్తన

కోనేరుసెంటర్: వివాహిత పట్ల చెగోడీల వ్యాపారి అసభ్యంగా ప్రవర్తించాడు. చిలకలపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం ఉల్లిపాలెంకు చెందిన వడ్రంగి వద్ద చెక్క నుంచి వచ్చే పొట్టును చెగోడీల వ్యాపారి చంద్రస్ శశికుమార్ ఐదేళ్లుగా కొనుగోలు చేస్తున్నాడు. గత నెల 20వ తేదీన శశికుమార్ పొట్టు కోసం వెళ్లగా యజమాని ఇంట్లో లేడు. ఒంటరిగా ఉన్న భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె గట్టిగా హెచ్చరించడంతో పారిపోయాడు. ఇంటికి వచ్చిన భర్తతో జరిగిన విషయం చెప్పింది. యజమాని హెచ్చరించినప్పటికీ శశికుమార్ ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో బాధితురాలు సోమవారం స్పందనలో ఎస్పీకి జరిగిన విషయంపై ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్పీ ఆ కేసును బందరు డీఎస్పీ మాధవరెడ్డికి అప్పగించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు చిలకలపూడి పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు శశికుమార్‌పై కేసు నమోదు చేశారని సీఐ రాజశేఖర్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి. సుధాకర్‌బాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఐసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ తొలిరోజు 1200 మందికి మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఐసీఈయూ నాయకులు టి. చంద్రపాల్, ఠాగూర్, శ్రీనివాస్, రత్నారావు, మాధుర్ తదితరులు పాల్గొన్నారు.

25 వేల మందికి అన్నదానం



అవనిగడ్డ: స్థానిక వంతెన సెంటర్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేసిన ప్రత్యేక షామియానాలో భక్తులకు అన్నదానం చేశారు. పలు ప్రాంతాలకు చెందిన 25 వేల మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● చల్లపల్లి: హనుమత్ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక గొడపాలెంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) అన్న సమారాధనను ప్రారంభించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు అన్నారు. సోమవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన నేపథ్యంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం తెలిపారు. నగరంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, నగరంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ ఫీడర్‌కు సంబంధించిన కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) పేలడంతో సోమవారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. విద్యుత్ సరఫరా చేసి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో అర్ధరాత్రి దీనిని పునరుద్ధరించామన్నారు. సోమవారం రాత్రి 9.30 గంటల సమయంలో నేషనల్ కాలేజీ వద్ద విద్యుత్ వినియోగం పెరగడంతో ఫీడర్ కండక్టర్ తెగిపోయిందన్నారు. దీని వల్ల భాస్కరపురం, ఉల్లింగిపాలెం ఇండోర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగిందన్నారు. దీనికి కూడా మరమ్మతులు చేసి అర్ధరాత్రి 12 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. అంతరాయం లేకుండా నగర ప్రజలకు విద్యుత్ సరఫరా చేసేందుకు 132 కేవీ సబ్‌స్టేషన్‌లో అదనంగా 50 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో నూతనంగా ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే పేర్ని నాని, మంత్రి జోగి రమేష్‌ల ఆదేశాలతో ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగదని భాస్కరరావు వివరించారు.

ఉల్లాసంగా విజ్ఞాన శిబిరాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. శిబిరాల్లో పాల్గొని విద్యార్థులు ఉల్లాసంగా గడిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిన్నారులకు మంగళవారం కథలు చెప్పటంతో పాటు పుస్తక పఠనం, సామెతలు నేర్పించారు. పలు పాటలకు డ్యాన్స్‌లు చేయించారు. ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ బోధించారు. ఉపాధ్యాయిని ఎం. విజయ భగవద్గీత 12వ అధ్యాయంలోని 6వ శ్లోకాన్ని నేర్పించి తాత్పర్యం వివరించారు. అనంతరం మెడిటేషన్ చేయించారు. ఉదయం విద్యార్థులకు శాస్త్రి సూర్య నమస్కారాలు, యోగా మెలకువలు నేర్పించారు. ఉపాధ్యాయిని వై. జయలక్ష్మీ క్రాఫ్ట్ వర్క్స్ నేర్పించారు. ఎం. సుందరి నీతి కథలు చెప్పారు. 9వ రోజు జరి



న్యూస్ పేపర్లు చదువుతున్న విద్యార్థులు

గిన ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు. నగరంలోని చిలకలపూడి, ఈడేపల్లి శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించారు. లైబ్రేరియన్లు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరమ్మ పర్యవేక్షించారు.

త్వరితగతిన దస్తావేజులు సేకరించాలి

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే కోసం దస్తావేజులు త్వరితగతిన సేకరించాలని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రీ సర్వే నిర్వహణ వేగవంతం చేసేలా ప్రభుత్వ సూచనలు వివరించారు. ప్రతి రైతును కలిసి వారి భూమికి సంబంధించిన దస్తావేజులు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. సాంకేతికంగా పాగోలులో రీ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో రైతులు తమ ధ్రువీకరణ పత్రాలతో పొలం వద్దకు వచ్చి విస్తీర్ణం సరిచూసుకునేం



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

దుకు వారికి సమాచారం అందించాలని తహసీల్దార్ సూచించారు. సమావేశంలో డీటీ కిషోర్, సీనియర్ అసిస్టెంట్ జీఎస్ఆర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

24 గంటల్లోనే గుర్తించిన పోలీసులు

కోనేరుసెంటర్: మచిలీపట్నానికి చెందిన బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై మంగళవారం మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా 24 గంటల్లోనే పోలీసులు బాలుడి ఆచూకీని కనుగొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బందరుకోటకు చెందిన బాలుడు (11) విజయవాడలోని రవీంద్ర భారతి స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లి మృతిచెందింది. తండ్రి పట్టించుకోకపోవడంతో హైదరాబాదుకు చెందిన సమీప బంధువు సదరు బాలుడిని తన సొంత ఖర్చులతో చదివిస్తోంది. వేసవి సెలవులు కావడంతో ఇటీవల బాలుడు తన మేనమామ ఇంటికి వచ్చాడు. రెండు రోజుల పాటు మేనమామ ఇంటి వద్ద ఉన్న బాలుడు సోమవారం క్రికెట్ ఆడుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి 11 గంటల సమయంలో తన మేనల్లుడు కనిపించడం లేదంటూ మేనమామ బలగం ప్రసాద్ మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సదరు బాలుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. బాలుడిని బుధవారం మచిలీపట్నానికి తీసుకువచ్చి బంధువులకు అప్పగిస్తామని మచిలీపట్నం పోలీసులు తెలిపారు.

జ్వరాలపై ఆందోళన వద్దు

జిల్లా మలేరియా అధికారి రామారావు

తోట్లవల్లూరు: జ్వరాలపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి బి.రామారావు తెలిపారు. తోట్లవల్లూరు శివారు కలాసుమాలపల్లిలో మంగళవారం ఆయన పర్యటించారు. ఆరోగ్య సిబ్బందిని మూడు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు ప్రబలాయన్న ప్రచారంపై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న ఆధ్వర్యంలో జరిపిన ఇంటింటి ఫీవర్ సర్వేలో కేవలం ఒక్కరు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. తాగునీటిని క్లోరినేషన్ చేయటంతోపాటు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామారావు పేర్కొన్నారు. జ్వర లక్షణాలతో బాధపడే వారికి తక్షణ వైద్యసేవలు అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ



కాలువ కట్టను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రామారావు, డాక్టర్ సాయిప్రసన్న

వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న, సబ్ యూనిట్ అధికారి శ్రీనువాసు, సీహెచ్ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓలు మాణిక్యం, పీవీ శ్రీధర్, ఆరోగ్య సిబ్బంది పద్మావతి, కృష్ణవేణి, కమలాక్షి, ఇందిర, ప్రసన్న, శివరామకృష్ణ, రత్నం, నందేశ్వరరావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కమ్మనమోలు(నాగాయలంక): స్థానిక గణపతి దత్తాత్రేయ సమేత షిర్డీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కల్యాణార్థం నరసాపురం (పశ్చిమ గోదావరి జిల్లా) సిద్ధాంతి పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు, దేవస్థానం అర్చకుడు దివి పార్థసారథి ఆచార్యులు ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపకుడు బండ్రెడ్డి నాగమల్లేశ్వరరావు, శ్రీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కుటుంబ సమేతంగా చండీహోమం నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బుధవారం అన్నసమారాధన నిర్వహిస్తామని, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు.

దస్తావేజులు పోయినవి

బలగం నాగసత్యవతి D/o. కె. వెంకట రామారావు, డోర్ నెం : 15/207-41, ఆనంద పేట, మచిలీపట్నం. అను నాకు చెందిన ఒరిజనల్ దస్తావేజు నెం : 864/92, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రార్ కు చెందిన దస్తావేజులు జిరాక్స్ నిమిత్తం రైతుబజారు వద్దకు వెళుతుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషకం ఇవ్వబడును.
సంప్రదించండి : 76599 99900